క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధం



చెరుకుపల్లి: ప్రమాదవశాత్తు సంబంధించిన అగ్ని ప్రమాదంలో గడ్డివామి, గోడ్లచావిడి దగ్ధమైన సంఘటన ఆదివారం మండలంలోని ఆళ్ల వారిపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జి.వెంకటేశ్వర్లు గడ్డివామికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. దీంతో మంటలు ఎగిసిపడి పక్కనే ఉన్న గోడ్ల చావడిని తాకాయి. స్థానికులు గమనించి మంటలను అదుపు చేసేలోపే 12 ఎకరాల వరి గడ్డివామి, గొడ్లచావిడి పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రూ 1.50 లక్షల ఆస్తి నష్టం వాటిలినట్లు బాధితుడు వాపోయారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై అనిల్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

డాక్టర్ ప్రజ్ఞాచారికి జాతీయ పురస్కారం



తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి మదర్ థెరిస్సా జాతీయ పురస్కారం లభించింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని సీఆర్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ రంగాల్లోని విశిష్ట వ్యక్తులకు మదర్‌థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ 17వ వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం జాతీయ పురస్కారాలు అందజేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డి.కిషోర్, సీఆర్‌సీ ఫౌండర్ విక్టరీ వెంకట్‌రెడ్డి, జాతీయస్థాయి చిత్రలేఖకుడు ఓడియార్, రూరల్ సీఐ రమణమ్మ, సిద్ధాంతి తాతాజీ పాల్గొని పూర్ణ ప్రజ్ఞాచారికి జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సాహితీ రంగంలో విశిష్ట సేవలను అందించినందుకు గానూ ఈ పురస్కారం లభించిందని ప్రజ్ఞాచారి తెలిపారు. ఇప్పటి వరకూ 12 జాతీయస్థాయి పురస్కారాలు అందుకోగా ఇది 13వ పురస్కారంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామ పెద్దలు అభినందించారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

పొన్నూరు: మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఏకా పవన్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని 31వ వార్డులోని తెలగాయపాలెంలో బాల్య వివాహాలను అరికట్టడం, ప్రారంభ గర్భధారణ వాటి వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది మగ్బుల్ బేగ్, పారాలీగల్ వలంటీర్ తాజ్ మహమూద్ బేగ్ పాల్గొని బాల్య వివాహాలు, గర్భధారణ ప్రారంభదశ పర్యవసనాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

సేవా సంస్థలను ప్రోత్సహించాలి



గుంటూరు రూరల్: సమాజంలో అనాథలను, అభాగ్యులను, మానసిక వికలాంగులను ఆదుకుంటున్న కార్మెల్ సేవా సదన్ లాంటి సంస్థలను ప్రోత్సహించడం మనందరి కర్తవ్యమని నరసరావుపేట లోక్‌సభ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఆదివారం గోరంట్ల గ్రామంలోని కార్మెల్ సేవా సదన్ ప్రాంగణంలో జరిగిన ప్రహరీ ప్రారంభోత్సవం, సేవాసంస్థల ఆత్మీయ సమ్మేళనాన్ని ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ.. కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్(గోతాల స్వామి) గత మూడు దశాబ్దాలుగా పొన్నూరు పట్టణంలో 300 మంది మానసిక వికలాంగులైన మహిళలకు, గుంటూరులోని గోరంట్ల వద్ద 75 మంది మానసిక వికలాంగులైన పురుషులకు ఉచితంగా భోజన, వసతిలతో పాటు సేవలను అందించడం వారి నిస్వార్థ సేవా తత్పరతకు నిదర్శనమన్నారు.

దివ్యాంగులకు అండగా..

డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ కేరళలో జన్మించిన జాక్ క్లమాకస్ కార్మెల్ సేవా సదన్‌ను స్థాపించి దాదాపు 400 మంది మానసిక దివ్యాంగులకు అండగా నిలిచారన్నారు. గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ శర్వాణి రెడీ మిక్స్ అధినేత పెద్దిరెడ్డి గోపాల్‌రెడ్డి కార్మెల్ సేవా సదన్ ప్రహరీ నిర్మాణానికి దాదాపు రూ.10 లక్షలు అందించడం హర్షణీయమన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డితో పాటు పలువురు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటపొలాలు

- తూటికాడ, గుర్రపుడెక్క తొలగించకపోవడంతోనే సమస్య
- రైతులను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



ముంపు పంటపొలాలను పరిశీలిస్తున్న వరికూటి అశోక్‌బాబు

వేమూరు: అధిక వర్షాల వల్ల వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని వేమూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. పెనుమర్రు, భట్టిప్రోలు ప్రాంతాలలోని నీట మునిగిన పంటపొలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మురుగు కాలువల్లో గుర్రపుడెక్క, తూటికాడ తొలగించకపోవడంతోనే సమస్య ఏర్పడిందన్నారు. భట్టిప్రోలు మండలంలోని మురుగు కాలువల్లో గుర్రపు డెక్క, తూటికాడను తొలగించాలి గత నెల 31న మురుగు కాలువలో చేపట్టిన జలదీక్షా కార్యక్రమాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అధికారులు గుర్రపుడెక్క తొలగిస్తామని హామీ ఇచ్చారని.. కానీ పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం కాలేదని ఆయన తెలిపారు.

నిలిపిన తొలగింపు పనులు..

స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సంబంధిత అధికారులతో మాట్లాడి గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపు పనులు ఆపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు అశోక్‌బాబు ఆరోపించారు. దీంతో ఆ తొలగింపు చర్యలు నిలిపి వేశారని ఆయన అన్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల వరి పంటలు పూర్తిగా మునిగి దెబ్బతిన్నాయని వివరించారు. ఇరిగేషన్ అధికారులు గుర్రపుడెక్క, తూటికాడ తొలగించినట్లుతే వరిపంటల పరిస్థితి నేడు బాగుండేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం మురుగు కాలువల్లో గుర్రపుడెక్క, తూటికాడ తొలగించకపోవడంతో రైతులు సాగు చేసిన పంట నీటి మునిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ తరుపున ఆందోళన చేస్తే పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేయడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. దీంతో రైతులకు ఈ దిస్థితి ఏర్పడిందని.. కూటమి ప్రభుత్వం రైతల సమస్యలను విస్మరిస్తోందని ఆయన వాపోయారు.

ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతన్నలు..

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టబాటు ధర లేక అప్పుల పాలవుతున్నారని అశోక్‌బాబు అన్నారు. ఖరీఫ్ సీజనలో వరిపంట సాగు చేస్తే ఇరిగేషన్ కాలువలకు మరమ్మతులు లేకపోవడంతో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. దీంతో కొల్లూరు మండలంలోని పోతర్లంక గ్రామానికి చెందిన కౌలు రైతు మురళీకృష్ణ ఆత్మహత్య చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎంతో మంది రైతులు, కౌలు రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన వాపోయారు. ప్రభుత్వం రైతులు గురించి పట్టించుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకునికి నివాళులు..



గంగయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వరికూటి

వైఎస్సార్‌సీపీ నాయకుడు తాగ గంగయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని పెరవలి గ్రామంలో ఆదివారం ఆయన గంగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగయ్య పార్టీకి చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దాది సుబ్బారావు, దాది రజిని, పోతురాజు, గోపాలం రాము, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో సరిపడా యూరియా

ఏడీఏ లక్ష్మి



స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మి

రేపల్లె: ఖరీఫ్‌కు అవసరమైన యూరియా డివిజన్‌లో అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు లక్ష్మి తెలిపారు. ఇసుకపల్లిలోని పలు ఎరువుల దుకాణాలను ఆదివారం యూరియా ఎన్‌ఫోర్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ లక్ష్మి మాట్లాడుతూ.. యూరియా కొరత ఉందనే అపోహతో అవసరం లేకున్నా రైతులు అధికంగా యూరియాను తీసుకెళుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. డివిజన్‌లో కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని.. రైతులు తమకు కావాల్సిన మేరకే తీసుకువెళ్లాలని సూచించారు. దుకాణాలో అధిక ధరలకు విక్రయాలు జరిపితే రైతులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అటువంటి దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలను పరిశీలించి స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏవో మహేష్ బాబు, ఆర్ఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు



రైతులతో మాట్లాడుతున్న సాంబిరెడ్డి

కొల్లిపర: కూటమి ప్రభుత్వంలో రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు ములకా శివసామిరెడ్డి తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిని.. మూడోసారి వెద పద్ధతి ద్వారా అత్తోట గ్రామంలో వరి నాటిన పొలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలు సరిగా లేక కొన్నాళ్లు.. అధిక వర్షాలతో మరి కొన్ని సార్లు.. ఎరువులు దొరకక మరికొన్ని మార్లు.. ఇలా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సర్పంచి దేశబోయిన నాగ పుణేశ్వరరావు మాట్లాడుతూ.. తమ గ్రామంలో 1,000 ఎకరాల వరి పొలాలను రెండు సార్లు వెద పెట్టామని.. ఇప్పుడు 100 ఎకరాలను మూడోసారి వెద పెట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వ సాయం నామమాత్రంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుర్ర కోటేశ్వరరావు, దేశబోయిన సోమయ్య శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం అంటే ప్రాణ దానం

మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి



రక్తదానం చేసిన వారికి అభినందన పత్రం అందజేస్తున్న గంజి చిరంజీవి తదితరులు

చినకాకాని(మంగళగిరి): రక్తదానం చేయడమంటే మరొకరి ప్రాణం నిలబెట్టినట్లేనని మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి తెలిపారు. ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ చీఫ్ అడ్మిస్ట్రేషన్ డాక్టర్ బీకే దాది ప్రకాశమణి 18వ పుణ్యస్మృతి సందర్భంగా ఆదివారం మండలంలోని చినాకాకాని ఎన్ఆర్ఐ సెంటర్‌లోని ప్రైవేటు హోటల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన చిరంజీవి దాతలకు అభినందన పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ దాతలు వెచ్చించే కొన్ని నిమిషాలు ఇతరులకు జీవితాన్ని ప్రసాదిస్తాయన్నారు. దాతలు ఇచ్చేది కేవలం రక్తం కాదని, జీవించేందుకు మరొక అవకాశం అని పేర్కొన్నారు. 22వ తేదీ 25 వరకు దేశవ్యాప్తంగా 15 వేల బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాలలో ఒకేసారి భారీ రక్తదాన శిబిరాలు నిర్వహించబడుతున్నాయన్నారు. ఈ ప్రచార లక్ష్యం 1లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించడమేనన్నారు. కార్యక్రమంలో రెయిన్ బో బ్లడ్ బ్యాంక్ చైర్మన్ కనిగంటి వెంకటేశ్వర్లు, డాక్టర్లు సి.రామచంద్, నవీన్, ఏఎస్ఎన్ రెడ్డి, బీకే నాగమణి, బీకే రత్న తదితరులు పాల్గొన్నారు.

కూలిన వృక్షం.. నిలిచిన వాహనాలు



అడ్డంగా విరిగి పడిపోయిన భారీ వృక్షం



కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

దుగ్గిరాల: విజయవాడ–తెనాలి రహదారిలో దుగ్గిరాల లాకుల వద్ద ఆదివారం సాయంత్రం భారీ వృక్షం విరిగి పడిపోయింది. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడం వేరే ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో వృక్షం తొలగించే వరకు సుమారు గంటకు పైగా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రమాదంలో తమ్మా శంకర్‌కు గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తెనాలి రూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణ మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన షేక్ గౌసియా(55) కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 18న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసుకోగా కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతి చెందారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారవేదిక నేడు

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు ప్రతీ మండల స్థాయిలోని రెవెన్యూ కార్యాలయం, రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుందని ఆయన తెలియజేశారు.

కాటూరి ఆర్ట్ గ్యాలరీలో విగ్రహావిష్కరణ నేడు

తెనాలి టౌన్: స్థానిక ఐతానగర్‌లోని కాటూరి ఆర్ట్ గ్యాలరీలో సోమవారం ఉదయం 9.30 గంటలకు భారీ ఐరన్ స్క్రాప్ విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కాటూరి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్కార భారతి అఖిల భారత సంఘటనా మంత్రి అభిజిత్ గోఖలే ముఖ్యఅతిథిగా పాల్గొని విగ్రహావిష్కరణ చేయనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

కొల్లిపర: మండల పరిధిలోని చివలూరు గ్రామ శివారు పంట పొలాల్లో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. జూదం ఆడుతున్న నలుగురినీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారి నుంచి రూ.10 వేలు నగదు, 5 బైకులు, 1 ఆటో స్వాధీన పరుచుకుని సీజ్ చేసిశారు. జూదరులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

అతిగా మద్యం తాగి యువకుడు మృతి

చేబ్రోలు: అతిగా మద్యం తాగి స్పిన్నింగ్ మిల్లు కార్మికుడు మృతి చెందిన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా ఫాసి గ్రామానికి చెందిన మిథున్ మండల్ (30) గత రెండేళ్లుగా కేకే స్పింటెక్స్‌లో స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మిథున్ మండల్, అతని భార్య సంధ్యారాణి మండల్‌తో కలిసి మిల్లులో పనిచేస్తూ క్వార్టర్‌లో నివసిస్తున్నారు. వీరికి పిల్లలు లేరు. మిథున్ మండల్ మద్యానికి బానిసవటంతో జీతం వచ్చిన తరువాత ఆహారం తీసుకోకుండా నిరంతరం మద్యం సేవించి మిల్లు ఆవరణలో తిరుగుతూ ప్రధాన గేటు వద్ద పడిపోయాడు. సెక్యూరిటీ గార్డు గుర్తించి పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. అతిగా మద్యం తాగటం ఆహారం తీసుకోకపోవడంతో గొంతు ఎండిపోయి మరణించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతుని భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సూరేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ 17 మంది రైతులకు రుణాలను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీసీ, వ్యవసాయ రుణాల కింద మొత్తం రూ1.40 కోట్ల చెక్కులను ఆయన రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వేమూరు వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్ చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, భట్టిప్రోలు పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, పీఏసీఎస్ సీఈవో బి.శ్రీనివాసరావు, కూటమి నాయకులు సుధాకర్, మోటూరు పుణ్యశ్రీనివాసరావు(చినబాబు), తూనుగుంట్ల సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో పెంపొందుతున్న జ్ఞాపక శక్తి

యోగా అసోసియేషన్ అధ్యక్షులు కళ్లెం



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న హరినాథరెడ్డి

బాపట్ల: యోగాతో జ్ఞాపక శక్తి పెంపొందుతోందని యోగా అసోసియేషన్ అధ్యక్షులు కళ్లెం హరినాథరెడ్డి పేర్కొన్నారు. జిల్లా అసోసియేషన ఆధ్వర్యంలో జిల్లా యోగాసనా ఛాంపియన్‌షిప్ 2024–25 పోటీలను ఆదివారం ఎకో హౌస్‌లో నిర్వహించారు. పోటీల అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగాను బాల్య దశ నుంచే అలవరుచుకోవాలని.. దీంతో శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. యోగాకు సంబంధించి మా అసోసియేషన్ అన్ని విధాల తోడ్పాటును అందించనుందని తెలిపారు. ముఖ్యఅతిథి చాపల సుబ్రహ్మణ్యం పాల్గొని విజేతలను అభినందించారు. బాపట్ల జిల్లా యోగా అసోసియేషన్ సెక్రెటరీ అల్లాడి రవికుమార్ మాట్లాడుతూ.. బాపట్ల పరిధిలోని అన్ని పాఠశాలలో యోగాకు ప్రాతినిధ్యం కల్పించే విధంగా మా సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో షేక్ సర్వరాజు, షేక్ సమీర్.. జూనియర్స్ విభాగంలో ఏ.షర్మిలరాణి, కె.అక్షయ, కె.హర్షిత.. సీనియర్స్ విభాగంలో బి.ప్రవళిక, పి.శ్రీనిధి, టి.మేఘవర్షిని గెలుపొందారు. విజేతలకు బాపట్ల జిల్లా యోగాసన అసోసియేషన్ కన్వీనర్ గురజాల శ్రీనివాసరావు, అడ్వకేట్ సతీష్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాలపర్తి శాంతకుమారి, సీహెచ్ పావనికుమారి యోగా సాధకులు పాల్గొన్నారు.

ఘనంగా మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న మానవత సభ్యులు

తెనాలి: ప్రతి మదిలోనూ మానవత వెల్లివిరిసినప్పుడు సమాజంలో శాంతి విరబూస్తోందని ఆదివారం నిర్వహించిన మానవత స్వచ్ఛంద సంస్థ శాంతి ర్యాలీలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని 125 శాఖలు, 81 వేల మంది సభ్యులు ఆగస్టు మాసంలో ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ నిర్వహించే శాంతి ర్యాలీలో భాగంగా, తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నెహ్రూ రోడ్డులోని ఐలమ్మ పార్కు నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీచౌక్, మెయిన్‌రోడ్డు, గంగానమ్మపేట, ప్రకాశంరోడ్డు నుంచి ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ వరకూ సాగింది. మానవత సభ్యులు, డిగ్రీ విద్యార్థులు కలిసి పాల్గొన్న ర్యాలీని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ముఖ్యఅతిథి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. మట్టిలో మొక్కను.. మనిషిలో మానవత్వాన్ని నాటాలనేది తమ ఉద్దేశంగా చెప్పారు. తల్లిదండ్రులను భారమని వదిలేసుకోవడం.. మతిస్థిమితం లేనివారిని రోడ్లపాలు చేయడం చూస్తుంటే బాధ కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మానవత తరఫున విస్తృతంగా సేవలను అందిద్దామని చెప్పారు. మానవత వెల్లివిరిసిననాడు సమాజానికి ఏ లోటూ ఉండదని పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. కార్యక్రమంలో తెనాలిశాఖ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.వాసు, కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు కె.ప్రసాద్, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, కోశాధికారి ఎస్వీ శర్మ, చిట్టినేని సాంబశివరావు, మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, అయినాల మల్లేశ్వరరావు, మల్లాది అర్జున్, ఆలపాటి వెంకట్రామయ్య, జొన్నాదుల వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వెంకట్, కొల్లిపర కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో స్కిల్ పలావర్ ప్రాజెక్ట్



స్కిల్ పలావర్ ప్రాజెక్ట్‌ను వివరిస్తున్న కేఎల్‌యూ విద్యార్థి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో స్కిల్ పలావర్ ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాస హ్యాకథాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ కేఎల్‌యూలోని నైపుణ్య అభివృద్ధి విభాగం ద్వారా, సీఎస్ఈ, ఈసీఈ, ఏఐ డీఎస్, సీఎస్ఐటీ, ఐవోటీ విభాగాలలోని బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం రూపొందించబడిన ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాస చొరవ స్కిల్ పలావర్ కార్యక్రమం మొదటి దశను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. పలావర్ అనేది విద్యార్థులలో స్వీయ నిర్దేశిత అభ్యాసమని పేర్కొన్నారు. ప్రీ ఫైనల్ సంవత్సరం వారిని పరిశ్రమకు సిద్ధంగా ఉంచవచ్చునని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్కిల్ పలావర్ మరో దశ సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మూడు దశలుగా రూపకల్పన చేశామని, మొదటిది లెర్నథాన్, రెండవది వర్చువల్, మూడవది హ్యాకథాన్ అని వివరించారు. ఈ కార్యక్రమానికి కేఎల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేష్ కన్వీనర్‌గా వ్యవహరించాగా సీఎస్ఈ, ఈసీఈ, ఏఐ డీఎస్, సీఎస్ఐటీ, ఐవోటీ విభాగాల అధిపతులతో పాటు ఇతర అనుబంధ డొమైన్‌ల విభాగాధిపతులు, స్పాక్‌ల బృందంతో కలసి అవగాహన కల్పించారు. వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు మార్గదర్శకత్వం వహించారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

తెనాలి: వాసవి క్లబ్, కైలాసగిరి ఆధ్వర్యంలో గవర్నర్ విజిట్ సందర్భంగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్, హైదరాబాద్‌తో ఆదివారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఏర్పాటైన శిబిరంలో 300 మందికి క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. జిల్లా గవర్నర్ పులికొండ శ్రీనివాసరావు, ఆర్‌సీ మున్నలూరి గౌరీశంకర్ తదితరులు హాజరయ్యారు. శిబిరానికి వాసవి క్లబ్ సభ్యులు, హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు సహకరించారు. కార్యక్రమంలో చార్టెడ్ అధ్యక్షుడు శ్రీకాకొలను లక్ష్మీనారాయణ గుప్తా, అధ్యక్షుడు చుండూరి వెంకట శివప్రసాద్, కార్యదర్శి కొత్తమాసు వినోద్, కోశాధికారి చుండూరి రఘురాం గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

● విరుచుకుపడుతున్న శునకాలు!



భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కుక్కల బెడద రోజురోజుకు ఎక్కువవుతోందని స్థానికులు వాపోతున్నారు. గుంపులుగా శునకాలు సంచరిస్తూ పిల్లలు, మహిళలు, వృద్ధులపై విరుచుకుపడుతున్నాయి. దీంతో వారంతా భయభ్రాంతులకు గురవుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు వెంటపడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. సమస్య నుంచి పంచాయతీ అధికారులు తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. – భట్టిప్రోలు